అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

● ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చుతాం ● మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ● కాల్వబుగ్గలో కోటి దీపోత్సవం ● హాజరైన ఎమ్మెల్యేలు, టీడీపీ శ్రేణులు

ఓర్వకల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తామని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం, కోటి దీపోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గిత్తా జయసూర్య తదితరులు హాజరయ్యారు. వీరికి మల్లెల రాజశేఖర్, ఆలయ ఈఓ మద్దిలేటి, ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్ద కోటి దీపోత్సవాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు వెలిగించారు.

బహిరంగ సభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు జగన్ హయాంలో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, రహదారులకు మరమ్మతులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని, అందరం కలిసి వనభోజనాలకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఓర్వకల్లును పారిశ్రామిక కేంద్రంగా గుర్తించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఓర్వకల్లు ప్రాంతంలో విమానాశ్రయం ఉండటంతో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేశారనీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. టీడీపీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన సీఎంకు, మంత్రి లోకేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతోనే తనకు పదవి వచ్చిందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



కాల్వబుగ్గలో కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



మల్లెల రాజశేఖర్‌కు సన్మానం

మిగతా 6లో..

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ: మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తీవ్రంగా విమర్శించారు. శనివారం నంద్యాల పట్టణంలోని 29వ వార్డు ఇన్‌చార్జి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మంత్రి పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచడం, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం వంటి చర్యలు తీసుకుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, వాకా శివశంకర్, గుద్దేటి వెంకటేశ్వర్లు, సాయిరాం, జ్యోతి రాయల్ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

8న సాగునీటి సంఘాల ఎన్నిక

కలెక్టర్ రాజకుమారి



ఎన్నికల నిర్వహణ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా 8వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నిక జరుగుతుందని కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఆమె అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ డిసెంబరు 5న సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడుతుందని డిసెంబరు 8వతేదీ నాడు ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. కేసీ కాల్వ కింద 52, ఎస్సార్బీసీ కింద 50, తెలుగుగంగ కింద 47, శివభాష్యం ప్రాజెక్ట్ కింద 7, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 104, మైలవరం కింద ఒకటి వెరసి మొత్తం 261 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో నామినేషన్ వేసిన వ్యక్తిని ఎన్నుకోవడానికి రైతులు చేతులెత్తి తమ ఆమోదాన్ని తెలపాలన్నారు. 11వతేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14వ తేదీన ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలంలో నటకిరీటి

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను సినీ నటుడు రాజేంద్రప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన రాజేంద్రప్రసాద్‌కు అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



విరాళాన్ని ఏఈవోకు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

శివోహం...



నిత్యకళారాధనలో శైవ గీతాలకు సాంస్కృతిక నృత్య ప్రదర్శన

శ్రీశైలం దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో శనివారం కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. హైదరాబాదుకు చెందిన ఎస్.విశ్వశాంతి బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శనతో అలరించారు. గణపతి పంచరత్న కీర్తన, శివపంచాక్షరి, శివాష్టకం, అయిగిరినందిని తదితర గీతాలకు జ్ఞాపిక, శ్రీవిద్య, ప్రణతిమిశ్రా, దిష, హిమబిందు తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన నూపురు నృత్యాలయ బృందం విద్యార్థులు శరణ్య, అమూల్య, యశస్విని, గోవింద్, శ్రావణి, శ్రీనిధి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. -శ్రీశైలం(ఆంధ్రజ్యోతి)

విజిబుల్ పోలీసింగ్‌తో శాంతిభద్రతలు

నంద్యాల క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకే విజిబుల్ పోలీసింగ్ చేపట్టినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. గడిచిన 24 గంటల్లో పట్టణ శివారు ప్రాంతాలు, గ్రామాల్లో డ్రోన్ కెమెరాల సాయంతో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారు, డ్రైవింగ్ లైసెన్స్‌లేనివారు, వాహన ధ్రువపత్రాల్లేకుండా వాహనాలు నడిపిన 543 మందిని గుర్తించి వారి నుంచి రూ.52,495 జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో భాగంగా 21మందిని గుర్తించి 21వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 66 మందితోపాటు బహిరంగ ధూమపానం చేస్తున్న 51 కేసుల్లో రూ.4,290 జరిమాన విధించామన్నారు. డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న 17 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,48,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డోన్ టౌన్ పోలీసులు 11 బస్తాల్లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యం బస్తాలను, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆత్మకూరు సబ్ డివిజన్ నందికొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3,250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

వైభవంగా మహానందీశ్వరుని కల్యాణం



మహానందిలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లోక క్షేమంతోపాటు కార్తీక మాసం ముగింపు పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయం ప్రాంగణంలోని అభిషేక మండపం వద్దకు స్వామి, అమ్మవార ఉత్సవమూర్తుల విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రత్యేకంగా పూలతో ఏర్పాటు చేసిన వేదిక మీద ఉత్సవమూర్తులను ఆశీనులు గావించారు. ఆలయ వేదపండితులు, ఋత్వికులు వేదమంత్రాలతో మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్ల కల్యాణంను కన్నుల పండువగా జరిపారు. కార్యక్రమంలో దాత రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతులతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కామేశ్వరీ దేవికి స్వర్ణ కంఠాభరణం

మహానంది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహానందిలోని కామేశ్వరీ దేవి అమ్మవారికి ఆలయ వేదపండితులు 41 గ్రాముల స్వర్ణ కంఠాభరణాన్ని బహూకరించినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం అమ్మవారి ఆలయంలో వేదపండితులు నాగేశ్వర శర్మ, శ్యామల దంపతులతోపాటు శాంతారాం భట్, తారా భట్, శ్రీశైలం దేవస్థానం వేదపండితులు చెండూరి జ్యోతి స్వరూప్, భావనా కృష్ణ చైతన్య దంపతులు భక్తితో అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అర్జునశర్మ, జనార్దన్‌శర్మ ప్రకాశంశర్మ, రాముశర్మ పాల్గొన్నారు.




స్వర్ణ కంఠాభరణాన్ని ఈవోకు అందజేస్తున్న దాతలు

26 మంది సీఐలు బదిలీ

కర్నూలు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు, కడప, అనంతపురం రేంజ్ పరిధిలో 26 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు...

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బీవీ విక్రమ సింహ	ఎమ్మిగనూరు	వీఆర్, కర్నూలు
బీవీ మధుసూదనరావు	సీసీఎస్-1, కర్నూలు	ఎమ్మిగనూరు
కే.శ్రీనివాస నాయక్	వీఆర్, కర్నూలు	సీసీఎస్-1 కర్నూలు
ఎస్.అస్రార్ బాషా	నంద్యాల తాలుకా	నంద్యాల ఎస్‌బీ-2,
ఆర్.ఈశ్వరయ్య	డీటీసీ, నంద్యాల	నంద్యాల యూపీఎస్
ఏ.చాన్ బాషా	వీఆర్, అన్నమయ్య	డీటీసీ, నంద్యాల
డి.రాము	వీఆర్, నంద్యాల	ఆత్మకూరు
కే.మోహన్ రెడ్డి	పీసీఆర్, నంద్యాల	ఎస్‌బీ-1, నంద్యాల
బీఆర్ కృష్ణయ్య	వీఆర్, నంద్యాల	పీసీఆర్, నంద్యాల
జి.ఓబులేసు	ఆత్మకూరు	చిన్నచౌక్, కడప
కృష్ణమరాజు నాయక్	ఒంటిమిట్ట, కడప	వీఆర్,కడప
టి.బాబు	వీఆర్, అన్నమయ్య	ఒంటిమిట్ట, కడప
వి.నాగరాజు	ఆర్‌కే వ్యాలీ, కడప	సైబర్ క్రైం, కడప
కే.ఉలసయ్య	వీఆర్, చిత్తూరు	ఆర్‌కే వ్యాలీ, కడప
యు.వెంకట కుమార్	ఎస్‌బీ-1, కడప	వీఆర్, కడప
టి.రెడ్డప్ప	వీఆర్, కడప	సెబ్-1, కడప
పి.సురేంద్రనాథ్ రెడ్డి	వీఆర్, అన్నమయ్య	సెబ్-2, కడప
జి.ఇద్రుబాషా	వీఆర్, కడప	ఏహెచ్‌టీయు, కడప
టి.నరసింహులు	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య	పులివెందుల, కడప
కే.రాజారెడ్డి	బి.కొత్తకోట,అన్నమయ్య	ఎస్‌బీ-3 అన్నమయ్య
జి.జీవన్ గంగనాథ్	పులివెందుల, కడప	బి.కొత్తకోట అన్నమయ్య
టి.మధు	వీఆర్, అన్నమయ్య	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య
టీవీ సత్యనారాయణ	ఎస్‌బీ-1 అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
పి.రాజారమేష్	ఎస్‌బీ-3 అన్నమయ్య	ఎస్‌బీ-1 అన్నమయ్య
జే.శంకరయ్య	డీసీఆర్‌బీ, అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
ఎం.తులసీరాం	వీఆర్, అనంతపురం	డీసీఆర్‌బీ, అన్నమయ్య

పాత రైళ్లే.. కొత్త నెంబర్లు



మద్దికెర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ గుండా ప్రయాణించే పలు రైళ్లకు కొత్త నెంబర్లతో జనవరి 1 నుంచి అమలు అవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. శనివారం ఓ ప్రకటనలో విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం-గుంతకల్లు రైలుకు 77213, హిందూపురం టూ గుంతకల్లు 77214, గుంతకల్లు టూ డోన్‌కు 77203, డోన్ టు గుత్తికి 77207, గుత్తి-డోన్‌కు 77206, గుంతకల్లు-రాయచూరుకు 77201, రాయచూరు-గుంతకల్లు 77202, తిరుపతి-హుబ్లీ 57401, హుబ్లీ- తిరుపతి 57402, తిరుపతి-కదిరి దేవరపల్లి 57405, కదిరి దేవరపల్లి-తిరుపతి 57406, గుంతకల్లు-తిరుపతి 57401, తిరుపతి-గుంతకల్లు 57403, చిక్జాజూర్-గుంతకల్లు 57416, గుంతకల్లు-చిక్జాజూర్ 57415, కాచిగూడ-గుంతకల్లు 57412, గుంతకల్లు-బోధన్ 57411 నెంబర్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెంబర్లు వచ్చే ఏడాది జనవరి నుంచి అమలువుతాయన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు సత్కారం

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కార్తీకమాసంలో నెల రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరూ పూజలు చేస్తున్నారని, పవిత్రమైన బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో వనభోజన ఏర్పాట్లు చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, ఏపీ మార్క్‌ఫెడ్ సభ్యులు తులసిరెడ్డి, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కైప పద్మలతా రెడ్డి, అర్బన్ ఫైనాన్స్, సివిల్ సప్లైస్, వాల్మీకి, యాదవ, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, బోయ మహేష్, వలసల రామకృష్ణ, వెంకటేశ్వర్లు యాదవ్, అరుణ కుమార్‌నాయక్, ముదావత్ జీవ్లా నాయక్, పొదుపులక్ష్మి గౌరవసలహాదారు విజయభారతి, నాయకులు గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రపెద్దస్వామి, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, కేవీ మధు, మహబూబ్ బాషా, గొల్ల నాగరాజు, వెంకటరమణ, నంద్యాల జిల్లాలోని టీడీపీ నాయకులు, పాణ్యం నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కాగా ప్రముఖులకు హుశేనాపురం ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా గజమాలతో సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు మల్లెల రాజశేఖర్ ఘనంగా సత్కరించి టీటీడీ ప్రసాదాలను అందజేశారు. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. వీరికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.50వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.



సాంస్కృతిక నృత్య ప్రదర్శన



ఆశయం

ఆత్మస్థైర్యమే ఆయుధం

ఆత్మస్థైర్యమే ఆమెకు ఆయుధమైంది. మనోవిశ్వాసమే ముందుకు నడిపించింది. అనుకున్న లక్ష్యం ముందు అంగవైకల్యం చిన్నబోయింది. క్రీడా రంగాన్ని ఎంచుకొని అందులో రాణిస్తోంది. మద్దికెరకు చెందిన శివాని

ఎమ్మిగనూరు మండలం బనవాసిలోని నవోదయ పాఠశాలలో 10వ తరగతి చదువుతూ జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంది. జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించింది. ఆసక్తి, శ్రద్ధ, లక్ష్యం ఉండాలే కానీ.. అంగవైకల్యం చిన్నబోక తప్పదని నిరూపించింది. అందరితో ఔరా అనిపించుకుంటోంది.



- చిన్నబోయిన అంగవైకల్యం
- జావెలిన్ త్రోలో శివానికి బంగారు పతకం

మద్దికెర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని పందులకుంట వీధిలో నివసించే ఉప్పర లలిత, వీరప్ప దంపతుల కుమార్తె శివానికి చిన్నతనంలోనే పోలియో సోకింది. దీంతో ఒక చేయి సరిగాలేదు. అయినప్పటికీ తల్లిదండ్రులు ఆమెను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తమ శాయశక్తులా కృషి చేశారు. ఆకుకూరలు అమ్ముతూ జీవనం సాగించే తల్లిదండ్రులను శ్రమను కూడా శివాని గుర్తించింది. తల్లిదండ్రుల ఆశయ సాధనకు శివాని నిరంతరం పోరాడుతూ అందరి ప్రశంసలు పొందుతోందిది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు మద్దికెరలోని ఓ ప్రైవేటే పాఠశాలలో చదివింది. 6 నుంచి బనవాసిలోని నవోదయ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి వీరప్ప ఆకుకూరల వ్యాపారం చేస్తున్నాడు. శివాని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్థానిక విద్యాసాయి కళాశాలలో చదువుకుంది. 8వ తరగతి నుంచి అవుట్‌పుట్ జావిలెన్ త్రో విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ వస్తోంది. ఇటీవల గుజరాత్ ఎఫ్-46 విభాగంలో జావెలిన్‌త్రోలో పాల్గొని బంగారు పతకం సాధించింది. శివానిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పథకం అందించి అభినందించారు. ప్రస్తుతం హైదరాబాదులోని నవోదయ జవహర్ పాఠశాలలో చదువుకుంటోంది.



తల్లి దూరమైనా..

శివాని గెలుపుబాటలో పయనించేలా నిత్యం ప్రోత్సహించిన తల్లి లిఖిత ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. తన తల్లి కూడా దూరం కావడంతో ఆ విద్యార్థిని కుంగుబాటుకు గురైంది. థాయిలాండ్‌లో 2025 జనవరిలో జరిగే పోటీలకు సిద్ధమవుతున్న తరుణంలో తన తల్లి దూరం కావడంతో ఒకింత నిరాశ ఆమెను అవహించింది. తల్లి కోరిక నెరవేర్చాలని పోటీల్లో పాల్గొనాలని తండ్రి వీరన్న ధైర్యం ఇస్తూ వచ్చారు. కుమార్తెను ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపిస్తున్న తండ్రిని చూసి గ్రామస్థులు సైతం అభినందిస్తున్నారు.



తల్లిదండ్రులు లలిత, వీరప్పతో శివాని



బంగారు పతకం సాధించి..

ఇటీవల గుజరాత్‌లో జరిగిన జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎఫ్-46 విభాగం జావెలెన్‌త్రోలో శివాని సత్తా చాటి బంగారు పతకం సాధించింది. రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పతకం, పురస్కారం పొందారు. గత ఏడాది నవంబరులో థాయిల్యాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ జావెలిన్‌త్రో పోటీల్లో ప్రతిభ కనబరిచింది. వచ్చే ఏడాది జనవరిలో మరోసారి థాయిలాండ్‌లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తండ్రి వీరన్న తెలిపారు.



95.40 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి : కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని శనివారం సాయంత్రం 6గంటల సమయానికి 95.49 శాతం పూర్తిచేసినట్లు కలెక్టర్ రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో మంచానికే పరిమితమైన బాలుడు హేమంత్‌కు, మరో లబ్ధిదారు గాజుల లక్ష్మీదేవికి కలెక్టర్ రాజకుమారి పింఛన్ అందజేశారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే అన్ని మండలాలలో 2,06,836 మందికి 87.49 కోట్లరూపాయల మొత్తాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

మార్కెట్ సెస్సు లక్ష్యాన్ని చేరుకుంటాం

మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సెస్సు లక్ష్యాన్ని చేరుకుంటామని కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి అన్నారు. కర్నూలు మార్కెట్ కమిటీకి రూ.7.60 కోట్లు, ఆదోని నుంచి రూ.17.10 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి రూ.6.10 కోట్లు, ఆలూరు నుంచి రూ.1.20 కోట్లు, పత్తికొండ మార్కెట్ కమిటీ నుంచి రూ.82 లక్షలు, కోడుమూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.1.90 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.1.46 కోట్ల సెస్సు వసూలు చేయాలని రాయలసీమ మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ఆదేశించారని తెలిపారు. మొత్తం ఏడు కమిటీల నుంచి రూ.36.18 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. దిగుబడులు పూర్తి స్థాయిలో రైతులకు అందాయని, అందువల్ల ఎటువంటి ఆటంకాలు లేకుండా సెస్సు వసూలు చేస్తామని ఏడీఎం ధీమా వ్యక్తం చేశారు. ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో వ్యాపారులు జీరో వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఎయిడ్స్ తగ్గుతోంది

- అవగాహనతోనే హెచ్‌ఐవీ దూరం
- నివారణకు కృషి చేస్తున్న అన్ని విభాగాలు
- నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

కర్నూలు హాస్పిటల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ ఇమ్యూనో డే ఫిషీయెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) ప్రాణాంతకమైన వ్యాధి. మందులేని ఈ మాయాదారి రోగం ప్రపంచానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ప్రపంచాన్ని గడగడలాడించిన ఎయిడ్స్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. కర్నూలు జిల్లాలో 2002లో హెచ్‌ఐవీ పాజిటివ్ శాతం 0.50 శాతం ఉన్న వ్యాప్తి 2021 నాటికి 0.33 శాతంగా ఉంది. ఎయిడ్స్ మెల్లగా తగ్గుతున్నప్పటికీ ప్రపంచంలో ఇంకా పూర్తిగా నిర్మూలన కాలేదు. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 డిసెంబరు 1 నుంచి ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంగా పాటిస్తున్నారు. ఇండియాలో మొట్టమొదటిగా 1986లో ఎయిడ్స్‌ను గుర్తించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌వో "హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం నా హక్కు" అన్న నినాదాన్ని ఇచ్చింది.

జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కింద అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఐసీటీసీ కేంద్రాలు, ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు 87, ఏఆర్‌టీ ప్లస్ కేంద్రం కర్నూలు జీజీహెచ్, ఏఆర్‌టీ కేంద్రం ఏరియా ఆసుపత్రి ఆదోని, లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు-3, ప్రభుత్వ, ప్రైవేటు రక్తనిధి కేంద్రాలు 14, ప్రివెన్షన్ యూనిట్లు 5, లింక్ వర్కర్ ప్రాజెక్టు చైల్డ్ ఫండ్ ఇండియా (48 గ్రామాల్లో)-1, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్-1 కేంద్రాలున్నాయి. జిల్లాలో ఏఆర్‌టీ కేంద్రాల్లో చికిత్స కోసం నమోదు చేసుకున్న వారి సంఖ్య 18,843 ఉండగా.. ఏఆర్‌టీ కేంద్రంలో మందులు వాడే వారి సంఖ్య 7485, ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంలో 2వ రకపు మందులు వాడేవారి సంఖ్య 669 ఉండగా.. ఏఆర్‌టీ పెన్షన్లు తీసుకుంటున్న వారు 668 బాధితులు ఉన్నారు. 2011-12లో 59,982 మందికి పరీక్షలు చేయగా.. 2920 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారు. ఇక 40,653 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా.. 167 మందికి హెచ్‌ఐవీ సోకింది. 2024లో 62,107 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయగా.. మొత్తం 291 మంది బాధితులు ఉన్నారు.

హెచ్‌ఐవీ సోకడానికి ప్రధాన కారణాలివే

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకడానికి ప్రధాన కారణం అసురక్షితమైన సెక్స్ కండోమ్‌లను వినియోగించకుండా లైంగిక సంపర్కంలో పాల్గొనడం వల్ల ప్రధానంగా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వైరస్ వీర్యం, యోని ద్రవాల్లో, రక్తంలో వ్యాపిస్తుంది. రక్తమార్పిడి అవయవమార్పిడీ అసురక్షితమైన వైద్య విధానాల వల్ల హెచ్‌ఐవీ సోకుతుంది. వైరస్ ఉన్న వ్యక్తి వినియోగించిన ఇంజెక్షన్లు మరొకరికి ఉపయోగించడం వల్ల కూడా వైరస్ వ్యాపిస్తుంది. తల్లి నుంచి బిడ్డకు కూడా ఈ వైరస్ సంక్రమిస్తుంది. తల్లికి ఎయిడ్స్ ఉన్నట్లయితే.. ప్రసవ సమయంలో లేదా తల్లి పాలివ్వడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి నిర్ధారణకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణకు కొన్ని నిర్దిష్ట పరీక్షలు చేయించుకోవాలి.

ప్రభుత్వ విభాగాల సహకారంతో

- మహిళ, శిశు సంక్షేమ శాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం కింద హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారు 102 మంది చిన్నారులు లబ్ధిపొందుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులతో రెడ్ రిబ్బన్ క్లబ్బులు ఏర్పాటు చేసి రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు.
- ఇంటెన్సిఫైడ్ హెచ్‌ఐవీ ప్రచార కార్యక్రమంలో భాగంగా నాలుగు నెలల పాటు కళాశాల విద్యార్థులకు, యువత, హెచ్‌ఐవీ సోకే ప్రమాదం ఉన్న వ్యక్తులకు సుమారు 15వేల మందికి అవగాహన కల్పించారు.
- పోలీసు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలో 102 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి జిల్లాలో 31,035 యూనిట్ల రక్తం సేకరించడం ద్వారా రక్తం కొరత లేకుండా సురక్షిత రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేశారు.

పాజిటివ్ నెట్‌వర్క్ ద్వారా సేవలు



జిల్లా స్థాయి పాజిటివ్ నెట్‌వర్క్ ద్వారా హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు నాణ్యమైన జీవితాన్ని అందించడానికి ఉమ్మడి జిల్లాలో కృషి చేస్తున్నాం. సుమారు 13వేల మందికి ఆరోగ్యకరమైన, ఇతర సేవలను, హెచ్‌ఐవీ ఒకరి నుంచి మరొకటి సోకకుండా వారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నాం. ఎవరైనా హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తులు వివక్షకు గురైతే జిల్లా న్యాయ సేవాసంస్థ ద్వారా వారికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అన్ని విధాలా సహకరిస్తున్నాం. - బి. సుధారాణి, అధ్యక్షురాలు, నేస్తం జిల్లా పాజిటివ్ నెట్‌వర్క్ సంస్థ, కర్నూలు

హెచ్‌ఐవీ పాజిటివిటీలో 7వ స్థానం



హెచ్‌ఐవీ సెంటినెల్ సర్వేలైన్ సర్వే ప్రకారం ఎయిడ్ పాజిటివిటీ కేసుల్లో జిల్లా 7వ స్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో ఏడాది అక్టోబరు వరకు 567 కేసులు వచ్చాయి. ఇక జిల్లాలో హెచ్‌ఐవీ మొదటి రకం మందులు వాడే వారు 7585, రెండో రకం మందులు వాడే వారు 669 మంది ఉన్నారు. ఏఆర్‌టీ పింఛన్ 668కి పింఛన్ ఇస్తు ప్రోత్సాహకాన్ని ఇస్తున్నాం. హెచ్‌ఐవీ పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని, రక్తమార్పిడి, కలుషిత సిరంజుల వాడకం అసురక్షితమైన సెక్స్ వల్ల ఎయిడ్స్ వస్తుంది.

- డా.ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో




జిల్లాలో హెచ్‌ఐవీ పాజిటివ్‌ల సంఖ్య

సంవత్సరం	సాధారణ ప్రజలు-హెచ్‌ఐవీ పరీక్ష	హెచ్‌ఐవీ బాధితులు	హెచ్‌ఐవీ పరీక్షలు	గర్భిణులు హెచ్‌ఐవీ బాధితులు
2019-2020	104492	1223	97230	54
2020-2021	56169	576	86309	47
2021-2022	87865	885	102170	54
2022-2023	68182	620	83596	36
2023-2024	81882	477	80122	18
2024 (ఏప్రిల్-అక్టోబరు)	62107	291	31512	15



ఇది మంచి ప్రభుత్వం



గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు



గౌ॥ శ్రీ నారా లోకేష్ గారు
ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖ మంత్రివర్యులు



కార్తీకమాసం శుభాకాంక్షలు

ఆంధ్రజ్యోతికి 22 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

22 ANNIVERSARY YEARS

గౌ॥ శ్రీ బీసీ జనార్ధన్ రెడ్డి గారు

రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు బనగానపల్లె శాసనసభ్యులు



కేంద్రమంత్రి గడ్కరీని కలిసి, రాష్ట్రానికి నిధులు కేటాయించాలని కోరుతున్న సందర్భంగా



బనగానపల్లెలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సందర్భంగా



రోడ్ల అభివృద్ధి, నిర్మాణాలను అధ్యయనం చేసేందుకు గుజరాత్ ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా



రోడ్ల నిర్వహణ పరిశీలన నిమిత్తం అస్సాంలో పర్యటించిన సందర్భంగా



కుంగిన అవుకు రివిట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సందర్భంగా



బనగానపల్లె మండలం, కైప గ్రామంలో అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ చేస్తూ

ప్రజాసేవే లక్ష్యం..సుపరిపాలనే ఆయన ధ్యేయం..రాష్ట్ర ఆర్ అండ్ బి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పూర్తిగా అభివృద్ధి పైన దృష్టి సారించి, కేంద్ర మంత్రులను కలిసి, రాష్ట్రానికి నిధులు రాబట్టేందుకు యత్నిస్తున్న నిరంతర శ్రామికుడు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, ఆయా రాష్ట్రాల్లోని రోడ్ల నిర్మాణం, నిర్వహణ గురించి క్షుణంగా తెలుసుకుంటూ, అధ్వాన్నంగా మారిన రాష్ట్రంలోని రహదారులను గాడిన పెట్టేలా ప్రణాళికలు రచిస్తూ, మంత్రి పదవికి వన్నె తెస్తున్న నిజమైన నాయకుడు, బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజాప్రతినిధి అనే పదానికి కొత్త నిర్వచనం చెబుతున్న ప్రజానేత.. గౌ॥ శ్రీ బీసీ జనార్ధన్ రెడ్డి గారు.

మహానందిలో ముగిసిన కార్తీక మాసోత్సవాలు

మహానంది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కామేశ్వరీదేవి అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మతో పాటు అర్చకులు, ఋత్వికులు ప్రత్యేక పూజలను జరిపారు. అనంతరం వేదపండితుడు రవిశంకర్ అవధానితో పాటు ప్రత్యేక ఋత్వికులు లక్షబిల్వార్చన, కుంకుమార్చన దాతలు గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల చేత భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కలశాలతో రుద్రగుండం జలాలను తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణను చేసిన తర్వాత స్వయంభువు శివలింగాన్ని అభిషేకించారు. యాగశాల మంటపంలో వివిధ ద్రవ్యాలతో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఈవో, దాతల చేత నిర్వహింప చేసారు. దీంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగిసాయి. ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీశైలంలో కొనసాగుతున్న ఉత్సవాలు

శ్రీశైలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద పెద్ద ఎత్తున్న దీపారాధనలుచేశారు. అదేవిధంగా కొంతమంది భక్తులు లక్ష వొత్తుల నోములను నోచుకున్నారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనల కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో శనివారం అమావాస్య ఘడియలను పురస్కరించుకుని క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. కాగా అమావాస్య రోజులలో వీరభద్రస్వామికి జరిపించే విశేష అర్చనను భక్తులు పరోక్షసేవ ద్వారా భక్తులు జరిపించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది.


ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు


భోజనం గ్రామంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా


జూపాడుబంగ్లాలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

బండిఆత్మకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చెప్పారు. మండలంలోని భోజనం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. పింఛన్ అందజేత గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలా ప్రతి నెలా ప్రజాప్రతినిధులే స్వయంగా పంపిణీలో పాల్గొని, పంపిణీని పర్యవేక్షించటం ఈ ప్రభుత్వంలోనే సాధ్యమైందని అన్నారు. ఎంపీడీవో దస్తగిరి, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు రామలింగా రెడ్డి, బుగ్గరాముడు, మల్లేశ్వరరెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, మహేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సాయిబాబారెడ్డి, మాధవరెడ్డి, జాకీర్, కార్యదర్శి చంద్రనాయక్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వృద్ధులు, దివ్యాంగులకు ఒకటో తేదీ ఇచ్చే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఒకరోజు ముందే పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం జూపాడుబంగ్లాలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూఒకనెల తీసుకోకపోయిన తిరిగి వచ్చే నెలలో రెండునెలల పింఛను కలిపి తీసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, రవికుమార్‌యాదవ్, జంగాలపెద్దన్న, మద్దూరు సుధాకర్, రవికాంత్, రాముడు, కృష్ణారెడ్డి, సుబ్బన్న, ప్రసాద్, శాలుబాషా పాల్గొన్నారు.

ఎంపీఈవోకు నివాళి

కొత్తపల్లి: ఎంపీఈవో కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే జయసూర్య చెప్పారు. కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు పాములపాడులో ఉద్యానవనశాఖలో ఎంపీఈవోగా విధులు నిర్వహిస్తూ ఆత్మకూరు మండలం కరివేన గ్రామ శివారులో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీలో ఉన్న ఎంపీఈవో శ్రీనివాసులు మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నందికుంట టీడీపీ నాయకులు జహరుల్లా ఉన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల పట్టణంలో 6వవార్డు జగజ్జననీ నగర్‌లో ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఖాజా హఫీజ్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రషీద్, అమీర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.


నంద్యాలలో పింఛన్ పంపిణీ చేస్తున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

పెన్షనర్ల సమావేశం

నంద్యాల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిశాంతి భవన్‌లో పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శనివారం అధ్యక్షుడు శివనాగిరెడ్డి, కార్యదర్శి ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. 2013లో బహిరంగ ఎన్నికలు నిర్వహించారని, ఆ తర్వాత నిర్వహించకుండా అభిప్రాయాలు సేకరించకుండా మీరే పేర్లు ప్రకటించుకుంటే ఎలా అని కొందరు వాదనకు దిగారు. పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజగోపాల్ మాట్లాడుతూ అసోషియేషన్‌లోని సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పరిశీలకులుగా వచ్చిన మద్దిలేటిరెడ్డి, నారాయణ, పక్కిరెడ్డి కలుగజేసుకుని జనవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో నంద్యాల తాలుకా యూనిట్‌గా ఉండేదని ప్రస్తుతం జిల్లా యూనిట్‌గా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ప్రకటించారని తెలిపారు.

'బీజేపీతో అన్ని వర్గాలకు న్యాయం'


అభిరుచి మధు సమక్షంలో బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అభిరుచి మధు అన్నారు. శనివారం నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో ఆత్మకూరు పట్టణానికి చెందిన పలువురు వైసీపీని వీడి బీజేపీలో చేరారు. బీజేపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు సాంబశివగౌడ్, మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో మాడుగుల మహేష్, షేక్ నూర్, విజయ్ పాల్, నందికుంట గ్రామానికి చెందిన వెంకట రామిరెడ్డికి మధు బీజేపీ శాలువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'స్పోర్ట్స్ అకాడమీని సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో ఏర్పాటు చేయబోయే స్పోర్ట్స్ అకాడమీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ కూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ఫసిపిల్ మున్నా సూచించారు. పట్టణంలోని కేజీబీవీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తైక్వాండో, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నాయబ్, సయ్యద్ అసదుల్లా, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సర్వేను వేగవంతం చేయాలి'

పాములపాడు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌసింగ్ జియో ట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. శనివారం ఎర్రగూడూరులోని సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సర్వే తీరుపై ఆరా తీశారు.

ఊడుమాల్పురంలో పంటకోత ప్రయోగం


దిగుబడిని అంచనా వేస్తున్న డీఏవో

నంద్యాల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఊడుమాల్పురం గ్రామంలో శనివారం వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు. వరి పంటలో పంటకోత ప్రయోగంతో వచ్చిన దిగుబడి ఆధారంగా క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింపజేయనున్నట్లు డీఏవో మురళీకృష్ణ తెలిపారు. 5ఇంటు5 మీటర్ల బాగంలో ప్రయోగం చేపట్టగా 17,350 కేజీల దిగుబడి వచ్చిందని తెలిపారు. దిగుబడి ప్రకారం అంచనా మేరకు ఎకరాకు 28.1 క్వింటాలు దిగుబడి వస్తుందని చెప్పారు. ఏవో ప్రసాదరావు, వ్యవసాయ విస్తరణాధికారి మనోహర్, వ్యవసాయ సహాయకురాలు సంధ్య పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

మిడుతూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరులో తీసుకువస్తున్న వరిగడ్డికి విద్యుత్ తీగలు తగిలి శనివారం వరిగడ్డి దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని పీరుసాహేబ్‌పేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివీ.. మొత్కూరు గ్రామానికి చెందిన ఒక రైతు వద్ద పీరుసాహేబ్ పేట గ్రామానికి చెందిన శాలిమియ్య అను వ్యక్తి పశువుల మేత కోసం వరి గడ్డి కోలు చేశాడు. ట్రాక్టరులో వరిగడ్డి తీసుకువస్తుండగా పీరుసాహేబ్‌పేట గ్రామంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించి వరిగడ్డి దగ్ధమైంది. దీంతో అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ వరిగడ్డిని ట్రాక్టర్ నుంచి కిందకు వదిలేశాడు. వరిగడ్డి పూర్తిగా దగ్ధమవ్వడంతో రూ.10 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

మహిళ అదృశ్యం

పగిడ్యాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23వ తేదిన రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిందని, అప్పటి నుంచి ఆచూకీ లభించలేదని ఆమె భర్త శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ చాంద్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం ఎన్నికల అధికారులుగా, ఎన్నికల పరిశీలకులుగా హుసేన్ సాహెబ్ సమక్షంలో శనివారం ఆత్మకూరు మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా సి.ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.హనుమంతు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ మన్సూర్ హుసేన్, ఉపాధ్యక్షుడిగా రమణయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్.శోభ, కార్యదర్శులుగా సయ్యద్ రహమాన్,మల్లీశ్వరి, మహిళా కార్యదర్శిగా పి.సురేఖలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా నూర్ మహ్మద్, హుసేన్ సాహెబ్, చంద్రశేఖర్, ఖాజా మొహిద్దీన్, రాజేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు.

జిల్లెళ్ల వాసికి 'ఎక్సలెన్సీ ఐకానిక్' అవార్డు


అవార్డు అందుకుంటున్న సాయికుమార్

గోస్పాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా గోస్పాడు మండలం జిల్లెళ్ల గ్రామానికి చెందిన కంబగిరి సాయి కుమార్ అనే యువకుడు బెంగళూరులో ఎక్సలెన్సీ ఐకానిక్ అవార్డును అందుకున్నారు. బెంగళూరులోని ఓ హోటల్‌లో ప్రగతి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కేటగిరి విభాగంలో సాయి కుమార్ కర్ణాటక ఎక్సలెన్సీ అవార్డును కైవసం చేసుకున్నారు. పర్సనాలిటీ డెవల్‌మెంట్ కోచ్‌గా పని చేస్తున్న సాయి కుమార్ యువతకు ఇచ్చిన సందేశాలతో ఈ అవార్డు దక్కింది. రామయ్య ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ మీనా కోదండరామ్ చేతులమీదుగా సాయి కుమార్ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న కంబగిరి సాయి కుమార్‌ను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

'ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి'

పాణ్యం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చెంచులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్ సూచించారు. పాణ్యంలోని ఇందిరానగర్‌లోని చెంచులతో శనివారం ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని 167 చెంచుకుటుంబాలకు పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరయ్యాయని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు కేటాయించారన్నారు. కాలనీలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. 366 కుటుంబాల ఇంటి నిర్మాణాలలో మొదటి విడతలో 167 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఈఈ హరిగోపాల్, ఏఈ శ్రీనివాసరావు, సర్పంచ్ పల్లవి, ప్రిన్సిపాల్ సునందలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, చెంచులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

నంద్యాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల, బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు శనివారం నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనాథ్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమానికి నంద్యాల ఎంఈవో శివరామప్రసాద్, రాష్ట్ర అండర్-14 టేబుల్ టెన్నిస్ పరిశీలకుడు దుర్గా ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు, 50మంది అఫీషియల్స్, కోచ్‌లు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. అతిథులు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, నాగరాజు, టోర్నమెంట్ టెక్నికల్ అడ్వైజర్ విశ్వనాథ్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.


టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

నల్లమల పల్లెలకు 20 రోజుల్లో విద్యుత్ సౌకర్యం

● విద్యుత్‌శాఖ ఆత్మకూరు డీఈఈ రామసుబ్రహ్మణ్యం

కొత్తపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని నల్లమల్ల సమీప గ్రామాలైన సిద్ధేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడేనికి 20 రోజుల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఆత్మకూరు విద్యుత్ శాఖ డీఈఈ రామసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆయన కొత్తపల్లిలో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సంగమేశ్వరం నుంచి జానాల వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 8 మీటర్ల విద్యుత్ పోల్స్ 40, 9.1 మీటర్లు గల 54 విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 96.16 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే ఈ గ్రామాలకు విద్యుత్ వెలుగులు రానున్నట్లు తెలిపారు.

'21లోపు బిల్లులు చెల్లించాలి'

విద్యుత్ వినియోగదారులు గృహ అవసరాల విద్యుత్ బిల్లులు, వ్యవసాయానికి సంబంధించిన బిల్లులు ప్రతి నెలా 21లోగా చెల్లిస్తే సర్‌చార్జీలు ఉండవని డీఈఈ రామసుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్తపల్లి మండలంలో గృహాలకు సంబంధించిన విద్యుత్ పాత బకాయిలు రూ.3.91లక్షలు, వ్యవసాయానికి సంబంధించిన బకాయిలు రూ.2.90 లక్షలు ఉన్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు రూ.కోట్లల్లో ఉన్నాయని తెలిపారు. పాతబకాయిలు త్వరగా చెల్లించాలని, లేనిపక్షంలో ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఏ సమయంలోనైనా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెమాను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం సబ్జెక్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య గణితంలో పరీక్షలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులను, కమిటీ సభ్యులతో కలిసి ఇంటివద్దకే వెళ్లి తలిదండ్రుల చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందించారు. అన్ని సబ్జెక్టులను ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ


పాములపాడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పాములపాడు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం మండల ప్రభుత్వ వైద్యాధికారి నాగలక్ష్మి, ఎయిడ్స్ శాఖ నిర్వాహకులు, హెచ్‌ఎం గోపాల్, గ్రంథాలయాధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, మెరిబా సొసైటీ సభ్యులు జుల్ఫికర్ సూచించారు. శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్ వ్యాధిపై అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, అధ్యాపకులు విద్యాసాగర్ తదిరతులు పాల్గొన్నారు.

'ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి'

నంద్యాల కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024 లో భాగంగా ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఓటరుజాబితా సవరణ కార్యక్రమం-2025లో భాగంగా కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణు చరణ్‌లతో కలిసి ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు,ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకే ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో స్వీకరించిన క్లైమ్‌లు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. 2025 జనవరి 1వతేదీ నాటికి స్వీకరించిన క్లైయిమ్స్ డిస్పోజల్స్ పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలమేరకు క్లైయిమ్స్ పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 13,90,225మంది ఓటర్లు ఉన్నారని, ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 కు సంబంధించి 5,326 క్లెయుమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. 2025 జనవరి 1వ తేదీన తేది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. డీఆర్వో రామునాయక్, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, స్వీప్‌నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి'

మహానంది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. శనివారం మహానంది మండలం అల్లీనగరం గ్రామంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల డీన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు. అసోసియేట్ డీన్ మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎల్.విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బరామిరెడ్డి, మాధవి, గీతా శిరీష, వినోద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి'


అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

నంద్యాల క్రైం/పాణ్యం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళలు లైంగిక వేధింపులు, దాడులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ధైర్యంగా ముందుకు సాగాలని నంద్యాల మహిళా పోలీసు స్టేషన్ సీఐ రమేష్‌కుమార్ సూచించారు. ఆర్జీఎం, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సైబర్ క్రైం, ర్యాగింగ్, మహిళలపై జరిగే నేరాల నివారణపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర సమయంలో 112, 1930 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎస్ఐ ధనమ్మ, డీన్ డాక్టర్ రామిరెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ హరిత, డాక్టర్ సుధామాధురి, మహిళా పోలీసు స్టేషన్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

శ్రీశైలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఆదివారం శ్రీ కృష్ణ యాదవ అన్నసత్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, చర్మం, కంటి సంబంధిత వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని శ్రీశైల ప్రజలకు, భక్తులకు వైద్య సేవలు అందించనున్నారు.

'విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

వెలుగోడు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మార్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అపార్ ఐడి క్రియేట్ చేసేందుకు స్కూల్ రికార్డులలో, ఆధార్ కార్డులలో ఒకే పేరు, పుట్టిన తేదీ ఉండేలా మార్పులు చేసుకోవాలని సూచించిందని, దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని లేట్‌బర్త్ సర్టిఫికెట్లు త్వరగా అందేల చూడాలన్నారు. శివకుమార్, నయిసుల్లా, వరుణ్ సాయి పాల్గొన్నారు.

వామ్మో కుక్కలు..!

వెలుగోడు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మేజరు గ్రామ పంచాయతీలో గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. గతంలో ఎంతో మందిని కరిచి తీవ్రంగా గాయపరిచాయి. వెలుగోడు పాత బస్టాండులో ఒకటి కాదు, రెండు కాదు పదుల సంఖ్యలో సంచ రిస్తూ ప్రజలకు భయాందోళనకు గురి చేస్తున్నాయి. కుక్కల సంచారాన్ని అరికట్టి వాటి బారిన పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


వెలుగోడులో సంచరిస్తున్న కుక్కల గుంపు

సారా పట్టివేత

నందికొట్కూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొణిదేల గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటుసారా అమ్ముతున్న నీలిశికారీ పవన్‌ను అరెస్టు చేసి 10 లీటర్ల సారా, బైకును స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ జబ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, శంకర్‌నాయక్, కుమారి, కానిస్టేబుళ్లు సుధీర్, శ్వేతారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన


ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): బంగాళాఖాతం అల్ప పీడన ప్రభావం రైతులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. శనివారం చాగలమర్రి మండలంలో మోస్తరు చిరుజల్లులు పడ్డాయి. వాతావరణ మార్పు రావడం, ఆకాశం నల్లటి మబ్బులు కప్పుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యాన్ని యంత్రాలతో కోసి ఆరుబయట కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. ధాన్యం తడువ కుండా పట్టలు కప్పుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. రెండు రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఆళ్లగడ్డ సబ్ జైలు తనిఖీ


మాట్లాడుతున్న వెంకట శేషాద్రి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని సబ్ జైలును న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని ఖైదీలకు న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని అన్నారు. ఇందుకోసం 15100 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శల్వంత్, న్యాయవాది షాహినా బేగం పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

డోన్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా.సురేష్ బాబు, తెలుగు ఉపాధ్యాయుడు సంజీవరాయుడులు హాజరై గురజాడ అప్పారావు సేవలను విద్యార్థులకు వివరించారు. సమావేశంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాల్లో సన్మానాలు


సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మంత్రి, పాణ్యం ఎమ్మెల్యే, నాయకులు

డోన్ రూరల్/అవుకు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీడీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్‌గౌడు దంపతులు శనివారం పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలంలోని బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, టీడీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు హాజర య్యారు. ఈ సందర్భంగా స్వాముల వారిని దర్శించుకొని పూజలు చేశా రు. ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని, బోయ వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, ఏపీ గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ నాయక్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు శాలువలతో, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీఎస్పీ

బనగానపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శనివారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నూతన నంద్యాల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ మంత్రిని కలసి మొక్కను అందించారు. శాంతి భద్రతలపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

పేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేదలకు వరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీని ఆదరించాలని ఆయన కోరారు.

బేతంచెర్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు 95.62 శాతం పంపిణీ చే సినట్లు ఎంపీడీఆవో ఫజల్ రెహిమాన్ శనివారం తెలిపారు. డిసెంబరు 1 ఆదివారం కావడంతో నవంబరు 30న సామాజిక పింఛన్లను పంపిణీ చేయడం చేశామన్నారు.

ఘనంగా మాదిగల కార్తీక వన భోజనం


ఐక్యత చాటుతున్న నాయకులు

డోన్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయ ప్రాంతంలో మాదిగల కార్తీక మాస వనభోజనం కా ర్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా వన భోజన కార్యక్రమం జరిగే ప్రదేశానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రగుడి కిష్టన్న, నాయకులు శ్రీరాములు, గంధం శ్రీనివాసులు, గార్లపాటి మద్దిలేటి, వలసల బాలుడు, ఆవులదొడ్డి సర్పంచ్ మద్దిలేటి మాదిగ పాల్గొన్నారు.

పేదల ఇంటి కల సాకారం చేస్తాం

- అర్హులందరికీ ఇళ్ల పట్టాలు
- త్వరలో షాదీఖానా నిర్మాణం పూర్తి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఖాజీవాడలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా బనగానపల్లె పట్టణంలో అర్హులందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేసి గృహాలు మంజూరు చేసి పేదల ఇంటి కల సాకారం చేస్తామని రోడ్ల భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ఖాజీవాడలో ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో షాదీఖానా భవన పనులు త్వరలో పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఖాజీవాడాల్లో డ్రైనేజీ వ్య వస్థను నూతన సాంకేతిక విధా నంతో మెరుగు పరుస్తామన్నారు. పట్టణంలో అర్హులైన 3250 మందికి రూ. 1.62 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, అన్వర్ హుసేన్, అల్తాఫ్‌హుసేన్, అన్ను, నియజ్ అహమ్మద్, కూరగా యల శేఖర్, మజర్‌హుసేన్, టైలర్ బషీర్, ఇస్మాయిల్ ఖాన్, ఆది హుసేన్ రెడ్డి, రాయలసీమ సలాం, ఎంపీడీవో రమణ, డీఈ నాగ శ్రీని వాసులు, ఈవో సతీశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

బనగానపల్లె పట్టణానికి చెందిన టైలర్ షేక్ ఖలీల్‌బాషా ప్రమాదంలో కుడికాలు ఫ్యాక్చర్ అయింది. శనివారం టీడీపీ కార్యాలయంలో బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధితకుటుంబ సభ్యురాలు గౌసియాకు కార్మిక బీమా కింద రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ట్రస్టు చైర్మన్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అందజేశారు. ఆపత్కాలంలో ట్రస్టు ద్వారా ఆదుకున్న మంత్రికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకులకు దీటుగా పోస్టల్ సేవలు

- ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల
- ప్యాపిలిలో పోస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన


శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో బ్యాంకులకు దీటుగా పోస్టల్ సేవలు అందిస్తున్నట్లు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ సభ్యురాలు బైరెడ్డి శబరి అన్నారు. శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కలిసి పట్టణంలో రూ.40లక్షలతో నిర్మించనున్న పోస్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ప్రధాని మోదీ, కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దేశంలో పోస్టల్ సేవలు విస్తరిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాని బీమా యోజన తదితర అన్ని పథకాలు కూడా పోస్టల్ కార్యాలయాల్లో అమలవుతుండటం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్న ఉద్దేశంతో చంద్రబాబు ప్రతినెల ఇంటి దగ్గరనే సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం దశలవారిగా ఎన్నికల హామీలను నెరవేర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఉన్నతాధికారులు ఉపేంద్ర, జనార్దన్‌రెడ్డి, నాయకులు రాజా నారాయణమూర్తి, టి శ్రీనివాసులు, వై లక్ష్మీనారాయణయాదవ్, ఎం బాబాసాహెబ్, రామ్మోహన్‌యాదవ్, ఖాజాపీర్, మధు, కేసీ మద్దిలేటి, రాజారవి, గండికోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలతో పశువుల పోషణ: ఎమ్మెల్యే


మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఉయ్యాలవాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మినీ గోకులాల నిర్మాణంతో గ్రామాల్లో పశుపోషణ అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం సర్వాయిపల్లె గ్రామంలో ఆవుల శ్రీకాంత్ రెడ్డికి చెందిన మినీ గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పశు పోషణ అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు మినీ గోకులాలు మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలోనే మొదటి సారిగా సర్వాయిపల్లె గ్రామంలో గోకులం నిర్మించి, ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అలాగే గ్రామంలో వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో దేశంలో ఏపీనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బొరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కూడాల నారాయణరెడ్డి, మారరరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, చామల చంద్రశేఖర్ రెడ్డి, చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి, కర్రా రమేష్‌రెడ్డి, గోపిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ లేని సమాజం కోసం పాటుపడదాం

- డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి తంగమణి

డోన్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ లేని సమాజం కోసం పాటు పడుదామని డోన్ సబ్‌కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి అన్నారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి తంగమణి మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులను ఆదరించాలని అన్నారు. సమావేశంలో డోన్ కోర్టు న్యాయాధికారి రాహుల్ అంబేద్కర్, డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, హ్యాండ్స్ సిబ్బంది మధుకుమార్, పుష్పరాజ్, సరస్వతి, షాజహాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

బనగానపల్లె : బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్య అన్నారు. యువత ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకొని మరికొంత మందికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ బడేసాహెబ్, అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, రామన్న, రిషేశ్వరుడు, చంద్రకళ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏవోగా ప్రమీల బాధ్యతలు

దొర్నిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారిగా వి.ప్రమీల శనివారం బాధ్యతలు చేపట్టారు. డోన్ ఏఈవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఏవోగా దొర్నిపాడుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలకు ఈ పంట నమోదు, పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో సురేంద్ర, సిబ్బంది ఉన్నారు.

'రాజకీయ లబ్ధి కోసం మాట్లాడడం తగదు'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుడు కిశోర్‌రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం ఆర్టీసీ హైర్ బస్సుల యజమానుల గురించి మాట్లాడడం తగదని బస్సుల యజమానులు అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరులు ఆర్టీసీ హైర్ బస్సుల యజమానులను కమీషన్ అడిగారని సోషల్ మీడియాలో కిశోర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హైర్ బస్సుల యజమానులకు ఎవరి నుంచి ఎలాంటి ఇబ్బందులు లేవని వారు స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం ఉదయం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని రంగరాజుపేటకు చెందిన గణపతి అలియాస్ రమణారావు (43) అనే వ్యక్తి ఆర్టీసీ బస్టాండులో మెకానికల్‌గా పని చేస్తుండేవాడు. ఉదయం ఆర్టీసీ బస్సును డ్రైవరు అశోక్ రివర్స్ పోవడంతో బస్సు వెనుక కింద చక్రాల కింద రమణారావు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిపిన వెంటనే ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

నిధులు మంజూరు

రుద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో బీరవోలు వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు లక్ష్మీకాంత్ శనివారం తెలిపారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పంటకోత ప్రయోగం

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేములలో మహిళా రైతు సావిత్రి సాగు చేసిన మినుము పంట పొలంలో పంటకోత ప్రయోగం చేశారు. ఏవో రంగనేతాజీ, ఏఈవోలు మంజుల, ఫరూక్, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ప్యాపిలిలో హనుమాన్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక హనుమాన్ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజ లు నిర్వహిం చారు. అలాగే మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని కోరుమానుపల్లె సమీపంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుడం అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని ఆకుపూజ, పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ గావించారు.

చాగలమర్రి: చాగల మర్రి గ్రామంలోని పాత శివాలయంలో కార్తీకమా సం ముగింపు సందర్భం గా మండల సంయోజి త కన్వీనర్ లక్ష్మీదేవి ఆ ధ్వర్యంలో శనివారం భ క్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర పారాయణం చేశారు. శివపార్వతులకు ప్ర త్యే క పూజలు, అభిషేకాలు చేశారు. 108 దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. పార్వతిదేవికి సామూహికంగా ఒడిబియ్యం సమర్పించారు. శివపార్వతుల పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం : మండలం లోని వాసాపు రంలో వేంకటే శ్వరస్వామి లక్ష్మీ గోదాదేవి అమ్మవా రు మానస లింగేశ్వర స్వా మి త్రిపురసుం దరీదేవి అమ్మవార్లకు అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మ అభిషేకం చేశారు. వివిధ ప్రాంతా ల నుంచి తరలివచ్చిన భక్తులు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రుద్రవరం సమీ పంలో కొలువుదీరిన గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దొర్వి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

డోన్ రూరల్: మండలంలోని ఆవుల దొడ్డి గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.


రుద్రవరం మండలం వాసాపురంలో కుంకుమ అర్చన చేస్తున్న భక్తులు


సామగ్రి అందజేస్తున్న రామ్‌కో హెడ్ రెడ్డి నాగరాజు

గ్రామాల అభివృద్ధికి కృషి

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ పరిసర గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని కల్వటాల గ్రామ పంచాయతీ కార్యాలయానికి రూ.1.50 లక్షలు విలువచేసే కంప్యూటర్, వాటర్ ఫిల్టర్, కుర్చీలు, టేబుళ్లను ఎంపీడీవో ప్రసాద రెడ్డి, ఈవోఆర్డీ శివ, సర్పంచ్ కామిని సుమలత, క్రిష్ణరంగారెడ్డి దంపతుల సమక్షంలో రామ్‌కో ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ రామరాజు, సీనియర్ మేనేజర్ రవికుమార్, భరత్ రెడ్డి, కామిని భాస్కరరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మద్దిలేటి

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా నాయినిపల్లె వీఆర్‌ఏ కె.మద్దిలేటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఏపీఆర్ ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో నంద్యాలలో సమావేశాన్ని నిర్వహించారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ బీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్ర సాదరావు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ మెంబరు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. అధికారులు ప్రగతి నివేదికతో రావాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


ప్రతిజ్ఞ చేయిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ఎస్వీ చైతన్య ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్‌లు రమణారెడ్డి, రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య సంరక్షణ అనే నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో ప్లాస్టిక్ నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, గ్లాసులు, వాటర్‌బాటిళ్ల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. సమావేశంలో టీడీపీ నాయకుడు టంగుటూరు శ్రీనయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

అవుకు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మారం పుల్లారెడ్డిని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం

బనగానపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాగంటిలోని గోశాలకు మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి పశుగ్రాసం అందజేశారు. ఎనిమిది ఎకరాల వరిగడ్డిని శనివారం టీడీపీ నాయకుడు టంగుటూరు శ్రీనయ్యల ఆధ్వర్యంలో గోశా ల నిర్వాహకులకు అందజేశారు. గోశాలకు పశుగ్రాసాన్ని అందించిన తులసిరెడ్డిని బీసీ ఇందిరమ్మ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొబ్బల మదన్‌భూపాల్‌రెడ్డి, టీచర్ నాగరాజు, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప పడి పూజ

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిలా పదునెట్టాంబడి అయ్యప్ప ఆలయంలో ఆదివారం విలక్కిపడిపూజ, దీపోత్సవ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు సుంకు జనార్దన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, క్షీరాభిషేకం, హోమాలు, దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మర్రిపల్లెకు చెందిన అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలో ఆటోయాత్ర నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తినరసింహులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

35 మినీ గోకులాలు మంజూరు

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు పాడి పశువుల పెంపకం కోసం మినీ గోకులాలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఏపీవో నిర్మల తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 35 మినీ గోకులాలు మంజూరయ్యాయని అన్నారు. 12 మినీ గోకులాల పనులను ప్రారంభించామని అన్నారు. గోకులాలు నిర్మించుకునే రైతులకు ఉపాధిహామీ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు యల్లావత్తులలో హిందూ సమ్మేళనం

రుద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం పెద్దకంబలూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, హిందువులు తరలిరావాలని పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ఆ సంఘం సాధికార సమితి ప్రతినిధులు కోరారు. శనివారం సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ రామాచారి, ప్రతినిధులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వినతిపత్రం అందజేశారు. విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

టీడీపీని బలోపేతం చేయాలి

సంజామల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెండేకంటి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం సంజామల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్కి హుసేన్ మద్దిలేటితో కలిసి ప్రారంభించారు. గ్రామ ప్రజలు భారీగా తరలివచ్చి సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఓబుల్ రెడ్డి, సుబ్బారావు, మల్లు చంద్రశేఖర్ రెడ్డి, మాధవ, సానెం రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.